నివాసయోగ్యం.. నిరుపయోగం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా దేవపట్ల పీహెచ్‌సీ క్వార్టర్స్
- మరమ్మతులు జరిపి సిబ్బందికి అందుబాటులోకి తీసుకురావాలంటున్న స్థానికులు

సంబేపల్లె : ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యాన్ని అందించాలన్న సంకల్పంతో వైద్యం కోసం నిర్మించిన వసతి భవనాలు నేడు ముళ్లపొదలకు నిలయంగా మారాయి. గదులు పదిలం.. సేవలు శూన్యం అన్న చందంగా పరిస్థితి కనిపిస్తోంది. మండలంలోని దేవపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని పేదలకు, రోగులకు, జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగితే ప్రాథమిక చికిత్స కోసం ఈ ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చింది. ఇక్కడ వైద్య సేవలు అందించే వైద్యులు, వైద్య సిబ్బంది నివసించేందుకు ప్రభుత్వం క్వార్టర్స్ నిర్మించి అందుబాటులోకి తెచ్చింది. భవనాలు నివసించేందుకు అనువుగా ఉన్నప్పటికీ వైద్యాధికారుల నిర్లక్ష్యమో వైద్యులు, వైద్య సిబ్బంది నిర్వాకమో తెలీదు కానీ నివాసాలు కాస్త అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసాలుగా మారాయి. ఒక ప్పుడు సిబ్బంది, వైద్యులు ఇక్కడే ఉంటూ ఆస్పత్రికి వచ్చే వారికి వైద్యం అందించేవారు. ప్రస్తుతం క్వార్టర్స్‌లో ఎవరు నివసించకపోవడంతో రాత్రి అయితే మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. అలానే క్వార్టర్స్ ఆలనాపాలన అధికారులు చూడకపోవంతో పిచ్చి మొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగి పరిసర ప్రాంతాలు విషసర్పాలకు నిలయంగా మారాయి. క్వార్టర్స్‌కు మరమ్మతులు జరిపి సిబ్బందికి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.


కంపచెట్లతో అడవిని తలపిస్తున్న దేవపట్ల పీహెచ్‌సీ క్వార్టర్స్


నిరుపయోగంగా ఉన్న గదులు


క్వార్టర్స్ వద్ద దర్శనమిస్తున్న మందుబాటిళ్లు

వినియోగంలోకి తేవాలి



ఆసుపత్రి గదులను దాదాపు 40 సంవత్సరాల కిందట రాతితో కట్టారు. ఇప్పటి వరకు అవి చెక్కు చెదరలేదు. అప్పుడు రాతికట్టడం చాలా భద్రంగా బలంగా నిర్మించారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి ఆ గదులును వినియోగంలోకి తెచ్చి వైద్యులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. రోగులకు మెరుగైన సేవలు అందించాలి.

\- ఆవుల వేణుగోపాల్‌రెడ్డి, దేవపట్ల సర్పంచ్, సంబేపల్లె

దివ్యాంగులను ఆదుకునే బాధ్యత మీదికాదా?

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ. 6 వేలు, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ. 15 వేలు ఇస్తామన్న హామీ ఏమైందని గురువారం సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ ప్రశ్నించారు. కోడూరు మండలంలో దాదాపు 350 మందికిపైగా దివ్యాంగులు ఉన్నారని, సగం మందికి పింఛన్ రాలేదన్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే అర్హులైన దివ్యాంగులకు రూ. 6 వేలు, రూ. 15 వేలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదని ఆయన విమర్శించారు. ఎంతో మంది మంచానికే పరిమితమై ఉన్నారని వారిని ఇచ్చి మాట ప్రకారం ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిది అని తెలియజేశారు. సమతానగర్‌లోని అంజనమ్మ కుమారుడు శ్రావణ్ కుమార్ వయస్సు ఎనిమిది సంవత్సరాలు అని, తల ఒకటి తప్పా శరీరంలో ఏ అవయం పని చేయవని చెప్పారు. ఈ విషయాన్ని మండల, జిల్లా అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు దృష్టి సారించి దివ్యాంగుడికి పింఛన్ అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఎం మంజుల తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగుడిని చూపిస్తున్న దార్ల రాజశేఖర్

నాణ్యమైన వైద్య సేవలందించాలి

రాయచోటి అర్బన్ : వైద్యకోసం విచ్చేసే ప్రజలకు మరింత నాణ్యమైన సేవలను అందించాలని జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణాధికారి (డీపీఎంఓ) రియాజ్‌బేగ్ అన్నారు. గురువారం యండపల్లె పీహెచ్‌సీ దిగువఅబ్బవరం ఉప ఆరోగ్య కేంద్రం పరిధిలోని నక్కావాండ్లపల్లెలో 104 వైద్యసేవలను ఆయన డీఎస్‌ఎంఓ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

దిగువ అబ్బవరం ఆరోగ్యకేంద్రం పరిధిలోని షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు 104 సేవలను సక్రమంగా వినియోగించుకుంటున్నారా ? అంటూ ప్రశ్నించారు. ఆ మేరకు వైద్యుల వద్ద రికార్డులలో ఉన్న సమాచారాన్ని పరిశీలించారు. 104 వాహనం వద్దకు వైద్యసేవల కోసం విచ్చేసే గర్భిణులకు ఈసీజీ అవసరమైన మేర చేయాలంటూ వైద్యసిబ్బందిని ఆదేశించారు. ఓపీ సంఖ్య వీలైనంతమేర పెంచాలంటూ సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీలు ప్రతి బుధవారం నీటి నాణ్యతపరీక్షలు తప్పని సరిగా నిర్వహించాలని, ఫలితాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలంటూ సూచించారు. కార్యక్రమంలో యండపల్లె పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందిలు తదితరులు పాల్గొన్నారు.


104 వాహనం వద్ద రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలిస్తున్న డీపీఎంఓ, డీఎస్‌ఎంఓలు

క్లుప్తంగా

స్కిల్ హబ్ ద్వారా శిక్షణ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా స్కిల్ హబ్ సెంటర్‌లో కొత్త బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వనున్నారని గురువారం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ, ప్రిన్సిపల్ భాస్కర్ రెడ్డిలు తెలిపారు. ఆసక్తి కల్గిన వారు మూడు నెలల కోర్సులో చేరి ఉపాధి పొందాలని వారు పేర్కొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం


ఉమాదేవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెనగలూరు : మండలంలోని నల్లపురెడ్డిపల్లి అరుంధతివాడ ఎంపీపీ పాఠశాలలో పనిచేస్తున్న ఉమాదేవి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైనందుకు గురువారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ గిరివరదయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులకు, విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ నీలకంఠేశ్వరరాజు, చక్రంపేట ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ, పెనగలూరు ఎస్సీ హాస్టల్ వార్డన్ హరీ తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి


నాగా సుబ్బారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : ఊటుకూరు ఎంపీటీసీ నాగా చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నాగా సుబ్బారెడ్డి మృతదేహానికి ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి నివాళులర్పించారు. మండల పరిధిలోని కొండ్లోపల్లి గ్రామంలో గురువారం నాగా సుబ్బారెడ్డికి అంత్యక్రియలు నిర్వహించారు. ఆకేపాటితోపాటు రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలోని పలువురు నాయకులు మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, ఆకేపాటి మురళీరెడ్డి, కొండూరు శరత్‌కుమార్‌రాజు, పీసీ యోగీశ్వరరెడ్డి, జేసీబీ సుబ్బారెడ్డి, నాగా సుధాకర్‌రెడ్డి, నాగా గురుప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మందపల్లి దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రెడ్డెం వెంకటేష్ ప్రమాదవశాత్తు గాయపడి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి వెంకటేష్‌ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు అభినందనలు


విద్యార్థినులను అభినందిస్తున్న టీచర్లు

సంబేపల్లె : రాష్ట్రస్థాయి రెడ్ రిబ్బన్ పోటీలకు సంబేపల్లెలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికై నట్లు పాఠశాల హెచ్‌ఎం నరసింహారెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి చదువున్న విద్యార్థినులు రుక్సార్, రుక్సానాలకు వారికి శిక్షణ ఇచ్చిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డిలను పాఠశాలలో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, విజయసారథిరెడ్డి, దేవప్రసాద్‌రెడ్డి, రామయ్య, మహబూబ్‌బాషా, రెడ్డిశుఖర్, సురేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో క్లబ్ సేవలు విస్తృతం


బియ్యం బస్తాలను అందజేస్తున్న క్లబ్ సభ్యులు

రాయచోటి అర్బన్ : దాతల సహకారంతో క్లబ్ సేవలు విస్తృతం చేస్తామని లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ అధ్యక్షుడు పి.శివారెడ్డి అన్నారు. పట్టణంలోని కొత్తపేట రామాపురానికి చెందిన రాము అనే నిరుపేద కుటుంబానికి క్లబ్ ఆధ్వర్యంలో దాత రమాదేవి ఆర్థికసౌజన్యంతో నాలుగు బియ్యం బస్తాలను అందజేశారు.

అలరించిన జబర్దస్త్ టీం


పెనగలూరు వాసులను అలరిస్తున్న జబర్దస్త్ టీమ్

పెనగలూరు : మండల కేంద్రంలోని వినాయక స్వామి ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి జరిగిన జబర్దస్త్ టీమ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొత్తపల్లి యువత కార్యక్రమం ఏర్పాటు చేయడంతో పెద్దసంఖ్యలో ప్రేక్షకులు పాల్గొన్నారు. జబర్దస్త్ కళాకారులు స్కిట్‌లు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమానికి పోలీసులు బందోబస్తు కల్పించారు. కాగా ఉత్సవాలలో శుక్రవారం సాయంత్రం తలమంచి గిరీష్ రెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణాన్ని జరుపనున్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని నీరుకారుస్తున్నారు

రామాపురం : మధ్యాహ్న భోజనం విద్యార్థులు తినే విధంగా లేకుండా ఉందని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సి. శ్రీనివాసులు ఆరోపించారు. గురువారం మండలంలోని గోపగుడిపల్లె పంచాయతీ గోపగుడిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వాహకులు నీరు కారుస్తున్నారన్నారు. అన్నం ఉడికి ఉడికినట్లుగా విద్యార్థులకు పెడుతున్నారని ఆవేదన వక్తం చేశారు. అన్నంలో పురుగులు వచ్చిన ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చర్యలు లేవన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మధ్యాహ్న భోజన పథకం పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు సీపీఐ నియోజకవర్గ కార్యవర్గసభ్యులు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

ఏచూరి మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి తీరనిలోటు

రాయచోటి అర్బన్ : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం వామపక్ష ప్రజాతంత్ర మరణానికి తీరనిలోటు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో సీపీఎం నేతలు సీతారాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1974లో ఎస్ఎఫ్ఐ సభ్యుడిగా ఏచూరి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందన్నారు. తర్వాత అంచెలంచెలుగా ఎదిగి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారన్నారు. ఏచూరి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు నడుస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, రవికుమార్, చంద్రశేఖర్, రాజేశ్వరి, మణి, శాఖ కార్యదర్శులు హరిశర్మ, ఓబులమ్మ, వెంకటాచలపతి, వెంకట్రామిరెడ్డి, బాలక్రిష్ణ, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.


ఏచూరి చిత్రపటం వద్ద జోహార్లు అర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర, జిల్లా నేతలు

కార్మిక వర్గానికి తీరని లోటు

రైల్వేకోడూరు అర్బన్ : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు సీతారాం ఏచూరి మృతి కార్మిక వర్గానికి, దేశానికి తీరనిలోటు అని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు గురువారం తెలిపారు. చెన్నైలో పుట్టిన ఆయన హైదరాబాదులో స్థిరపడి లౌకికవాదానికి, కార్మిక లోకానికి అండగా నిలిచారన్నారు. ఆయన మరణం కమ్యూనిస్టు భావజాలాన్ని అభిమానించే వారికి జీర్ణించుకోలేని విషయమన్నారు. పార్లమెంటులో, రాజ్యసభల్లో కార్మికుల, పేదల గొంతుకను వినిపించడమే ధ్యేయంగా ఆయన పనిచేశారన్నారు.


కొరముట్ల శ్రీనివాసులు మాజీ ఎమ్మెల్యే

స్పష్టమైన వైఖరితో కెరీర్‌కు బాటలు వేసుకోండి

వైవీయూ : మనం ఎంపిక చేసుకున్న లక్ష్యాలపై స్పష్టమైన వైఖరితో కెరీర్‌కు బాటలు వేసుకోవాలని స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో స్టెప్ ఆధ్వర్యంలో 'కెరీర్ కౌన్సిలింగ్'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ కోర్సుల ఎంపిక ఇష్టం మేరకే చేసుకోవాలే తప్ప ఒత్తిడితోనో, ఎవరికోసమో చేసుకోకూడదన్నారు. న్యాయమూర్తి శంకర్ మాట్లాడుతూ కౌన్సిలింగ్ అనేది సరైన మార్గాన్ని కనుగొనడంలో సహాయపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ కెరీర్ కౌన్సిలింగ్‌ను విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, సూపర్‌వైజర్లు టి. నాగయ వి.వి. నారాయణ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్టెప్ సీఈఓ సాయిగ్రేస్

గణనాథుడికి ఘనంగా వీడ్కోలు


రాజంపేట టౌన్: అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి


రాయచోటి టౌన్: వేడుకల నడుమ గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు

రాయచోటి టౌన్ : వినాయకుడి కరుణ కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని మడితాటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. గురువారం పట్టణంలోని నాలుగు ప్రధాన వినాయకుడి మంటపాల వద్ద ఆయన ఆర్థికసౌజన్యంతో భక్తులకు అన్నదానం చేశారు. అలానే పట్టణంలోని గ్రూప్ థియేటర్ సమీపంలో, హరినాథ వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడికి టీడీపీ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు పూజలు నిర్వహించారు. రాజుల కాలనీలో వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఓబులవారిపల్లె : మండల వ్యాప్తంగా గురువారం వినాయక చవితి ఉత్సవ విగ్రహాలకు గ్రామస్తులు ఘనంగా నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని చిన్నఓరంపాడు పంచాయతీ అయ్యలరాజుపల్లిలో వినాయకుడిని ట్రాక్టర్‌పై పూలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో, మేళతాళాలతో వసంతాలు చల్లుకుంటూ వేడుకలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నారంరెడ్డి రఘురాం రెడ్డి, నారాయణరెడ్డి, శివారెడ్డి, నారంరెడ్డి అమర్, శ్రీకాంత్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్ : పట్టణంలోని ఎగువగడ్డవీధిలోని వినాయక విగ్రహం వద్ద ఉత్సవాలలో భాగంగా గురువారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పోలా వెంకటరమణారెడ్డితో కలసి భక్తులకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాపినేని విశ్వనాథరెడ్డి, సౌమిత్రి, పోలి వేణు, జీవీ సుబ్బరాజు, దాసరి పెంచలయ్య, మలిశెట్టి శ్రీనివాసులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని పలు గ్రామాలలో వెలసిన వినాయక ప్రతిమలు గురువారం భక్తుల కోలాహల నడుమ నిమజ్జనానికి తరలివెళ్లాయి. మండలంలోని లక్కిరెడ్డిపల్లి టౌన్, దిన్నెపాడు, పందిళ్లపల్లి తదితర గ్రామాల నుంచి వినాయక ప్రతిమలు నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లాయి. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

రామాపురం : మండల కేంద్రంతోపాటు చిట్లూరు తదితర గ్రామాలలో గురువారం వినాయక ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి చెరువులలో నిమజ్జనాలు చేశారు. రామాపురంలో అన్నదానం కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.


ఓబులవారిపల్లె: పూలతో అలంకరించిన వాహనంలో ఊరేగుతున్న వినాయకుడు


రామాపురం: అన్నదాన కార్యక్రమంలో రమేష్‌రెడ్డి


రాయచోటి టౌన్: అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

రాజంపేట : రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండలం మంగళపల్లె గ్రామంలోని గిరిజనుల భూముల ఆక్రమణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వండుగోల మణి కోరారు. ఈమేరకు సబ్‌కలెక్టర్ నైదియా దేవికి బాధితులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. వెంగయ్య, సుబ్బమ్మలకు 1996లో ప్రభుత్వం నిరుపేదలుగా గుర్తించి మూడు ఎకరాలు బంజరు భూమిని మంజూరు చేశారన్నారు. కాగా అదే గ్రామానికి చెందిన ఓసీలు ఆ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించి చంపేస్తామని బెదిరిస్తున్నారన్నారు. దీనిపై విచారణ చేసి గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో బీకేఎంయూ రాజంపేట నియోజకవర్గ అధ్యక్షుడు కోడూరు రవికుమార్, రైల్వేకోడూరు అధ్యక్షుడు రేవూరి కృష్ణయ్య, సామా గంగయ్య, తిప్పనప్రసాద్, పెనగలూరు మండల నాయకులు గుడిసె జయరాం, రమణయ్య, మంగళపల్లె ప్రజలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

వీరబల్లి : కోనేటివాళ్లపల్లెకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం మండల ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ మనీషా తనిఖీ చేశారు. వంటలను పరిశీలించి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రానికి వచ్చే గర్భిణులకు పౌష్టికాహారం అందించడమే కాక ఉపయోగాలను చెప్పాలన్నారు. అనంతరం 104 వాహనం ద్వారా అక్కడికి వచ్చిన ప్రజలకు, విద్యార్థులకు వైద్య సేవలు అందించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో భోజనాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ మనీషా

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజంపేట
(సీనియర్ డివిజన్)
యస్.ఓ.పి.ఇ/2024

1) కర్నాటం కాంతమ్మ, భర్త లేట్ కర్నాటం సుబ్బరాయుడు, హిందూ, వయస్సు 68 సం॥ములు, నివాసము: ప్లాటునం. 502, 5వ అంతస్తు డోరునం. 18-8-22/13, శ్రీహరి టవర్స్, ఫిష్ మార్కెట్టు వెనుకభాగమున, మధురానగర్, తిరుపతి అర్బన్ పోస్టు, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్. 2) కర్నాటం నాగేంద్రకుమార్, తండ్రి లేట్ కర్నాటం సుబ్బరాయుడు, హిందూ, వయస్సు 50 సం॥ములు, నివాసము: ప్లాటునం. 502, 5వ అంతస్తు, డోరునం. 18-8-22/13, శ్రీహరి టవర్స్, ఫిష్ మార్కెట్టు వెనుకభాగమున, మధురానగర్, తిరుపతి అర్బన్ పోస్టు, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.
3) కర్నాటం నాగ సునీల్ కుమార్, తండ్రి లేట్ కర్నాటం సుబ్బరాయుడు, హిందూ, వయస్సు 49 సం॥ములు, వ్యాపారము, నివాసము : డోరునం. 4/500, రసూల్ సాబ్ వీధి, రాజంపేట టౌన్ మరియు మండలము, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్.
4) కర్నాటం నాగ జ్యోతి తండ్రి లేట్ కర్నాటం సుబ్బరాయుడు, భర్త కొప్పరపు వెంకట రమణయ్య హిందూ వయస్సు 49 సం॥ములు, హౌస్ వైఫ్, నివాసము : డోరునం. 3/329, వై.యస్.ఆర్.కాలనీ, సాయికృప రెసిడెన్సీ, ప్రొద్దుటూరు టౌన్ మరియు మరియు మండలము, కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్.......... పిటీషనర్లు.

//వర్సెస్//

నిల్ .... రెస్పాండెంట్స్

పిటీషనర్లు నెం. 1 భర్త అయిన, నెం.2, 3, 4 కు తండ్రి గారయిన లేట్ కర్నాటం సుబ్బరాయుడు యొక్క కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, 600 షేర్లుకు సంబంధించి ఆ షేర్లు పైన చెప్పిన పిటీషనర్లు పేరుతో ట్రాన్స్ఫర్ కొరకు పైన చెప్పిన పిటీషన్లును పైన చెప్పిన కోర్టులో మమ్ములను లేట్ కర్నాటం సుబ్బరాయుడు యొక్క వారసులుగా డిక్లేర్ చేయమని సక్షషన్ సర్టిఫికెట్టు కొరకు పిటీషన్ దాఖలు చేసి యున్నారు. ఎవరికయినను ఏమయినా అభ్యంతరాలు ఉన్నఎడల 20.09.2024వ తేదీన ఉదయం 10.30 నిముషాలకు పై కోర్టులో ప్రత్యక్షంగా కానీ, వకీలు ద్వారా కానీ హాజరు అయి మనవి చేసుకోవలయును. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

// బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు //

P.N. శ్రీనివాసులు
పిటీషనర్లు పరం అడ్వకేటు, రాజంపేట

ప్రారంభమైన మండలస్థాయి క్రీడా పోటీలు

సిద్దవటం : మండలస్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భాకరాపేటలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం స్కూల్ గేమ్ ఫెడరేషన్, అండర్-14, 17 విభాగంలో మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ బాలుర, బాలికల పోటీలు జరిగాయని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగమునిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్‌లు రెడ్డెమ్మ, రామచంద్ర, సిరాజుల్లా, సురేంద్ర , విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సుండుపల్లె : మండల కేంద్రమైన సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం క్రీడా పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పరిధిలో ఈ పోటీలను నిర్వహించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయన్న, ఫిజికల్ డైరెక్టర్లు రవీంద్రరాజు, రాధారాణిలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ రవీంద్ర నాయక్ ఈ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఏడు రకాల క్రీడలలో పోటీలు జరిగాయి. విజయం సాధించిన వారు నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారు.


రామాపురం : నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారులు రామకృష్ణుడు, జయంద్రలు మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను గురువారం ప్రారంభించారు. మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం పెంపొందించుకోవాలని తెలిపారు. చెస్, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సూజాతమ్మ, మహమ్మద్ హిలాల్, పీడీలు నరేంద్రకుమార్‌రెడ్డి, రెడ్డయ్య, ఆంజనేయులు, జాహిద్ అలీ, ఉపసర్పంచ్ మహబూబ్‌బాషా, స్కూల్ చైర్మన్ రియాజ్, సయ్యద్ పీర్ పాల్గొన్నారు.


పుల్లంపేట : మండలంలోని కొత్తపేట హైస్కూల్‌లో ఎంఈఓలు చక్రాధర్ రాజు, నాగతిరుమలరావుల ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. చెస్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు మండలస్థాయిలో జరిపారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

చిట్వేలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా ఎంఈఓలు కోదండనాయుడు, ఈశ్వరయ్యలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. మొదటిరోజు క్రీడా పోటీలలో భాగంగా అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాలలో వాలీబాల్, ఖోఖో, కబడీ, చెస్‌లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పైస్థాయికి ఎంపిక చేశారు.

నందలూరు : నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీలను ఎంఈఓలు ఎల్ నాగయ్య, సిఆర్ అనంతకృష్ణ, హెచ్‌ఎం ఎస్ శ్రీనివాసులు, స్కూల్ గేమ్స్ మండల కో-ఆర్డినేటర్ కృష్ణయ్య, అసిస్టెంట్ హెచ్‌ఎం షేక్ రాఫ్ బాషాలు ప్రారంభించారు. విద్యార్థులకు ఏడు క్రీడల్లో పోటీలు జరిపారు.


చిట్వేలి: కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు


సుండుపల్లె: యోగాసనాలు వేస్తున్న చిన్నారులు


పుల్లంపేట: విజేతలతో ఉపాధ్యాయులు

